శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, చిత్రంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: కేసుల విచారణలో జాప్యం జరగకుండా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలని మల్టీ జోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సూచించారు. ఆకతాయిల పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు సమీపంగా జిల్లా ఉన్నందున మృతదేహాలను ఇక్కడ పారవేసే అవకాశం ఉందని.. జాతీయ రహదారులు, అటవీ ప్రాంత రహదారుల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కల్తీ కల్లు దుకాణాలపై, రియల్ ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు ప్రసన్న కుమార్, వెంకటరెడ్డి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

శతశాతం అక్షరాస్యతే లక్ష్యం: కలెక్టర్



సన్మానిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, నర్సాపూర్, చేగుంట, న్యూస్‌టుడే: మహిళా సంఘాల సభ్యులు శతశాతం అక్షరాస్యత సాధించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవనంలో ఏర్పాటు చేసిన జిల్లా మహిళా సమాఖ్య ఏడో వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా ముందుకెళ్లాలని సూచించారు. అనంతరం 2023-24లో ఉత్తమ ప్రతిభ కనబరచిన తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట, నర్సాపూర్, హవేలీఘనపూర్, మెదక్ మండలాల అధ్యక్షురాళ్లను, ఏపీఎంలను కలెక్టర్ శాలువాతో సన్మానించి, జ్ఞాపికలు అందచేశారు. చేగుంట మండలంలో జిల్లాలోనే మొదటిసారిగా నాటుకోడి పిల్లల పెంపకం ప్రారంభించిన సునీతను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్ రావు, ఏపీడీ సరస్వతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నవనీత పాల్గొన్నారు.

ఒకే రోజు 9 ప్రాణాలు

వేర్వేరు ఘటనల్లో మృతి



జిల్లాలో మృత్యు విహారం కొనసాగింది. మానసిక వేదనతో కొందరు, విధి వక్రీకరించి మరికొందరు తొమ్మిది మంది ఒకే రోజు ప్రాణాలు కోల్పోయారు. అంతకుముందే తమతో మాట్లాడినవారు, ఇపుడే వస్తానని బయటకు వెళ్లిన వారు విగత జీవులుగా మారడాన్ని వారంతా జీర్ణించుకోలేకపోతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో..



గోపాల్

హవేలిఘనపూర్: ఆర్థిక ఇబ్బందులతో చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధి సుల్తాన్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన అరిగె గోపాల్(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆయన రాల కోసం చేసిన అప్పుల గురించి తరచూ భార్య పోచమ్మతో చెబుతూ బాధ పడేవాడు. మంగళవారం ఇంటి నుంచి వెళ్లి గ్రామ సమీపంలో ఉన్న చెరువులో పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం చెరువు వద్ద చెప్పులు కనిపించడంతో ఈతగాళ్ల సాయంతో గాలించగా మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సమియొద్దీన్ వివరించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



మల్లేశం

హవేలిఘనపూర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. మెదక్ మండలం మక్తభూపతిపూర్ గ్రామానికి చెందిన కర్రోళ్ల మల్లేశం(35), కొల్చారం మండలం కొనుగొదుకు చెందిన ఎల్లంతో కలిసి బుధవారం బంధువుల అంత్యక్రియలకు వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తున్నారు. ఫరీద్‌పూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మల్లేశం అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లం పరిస్థితి విషమంగా ఉండటంతో గాంధీ ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో యువరైతు..



రాజు

హవేలిఘనపూర్: విద్యుదాఘాతంతో యువరైతు మృతి చెందిన ఘటన మండల పరిధి కాప్రాయిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... గ్రామానికి చెందిన రాజు(28) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం పొలంలో మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సమియొద్దీన్ వివరించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని..



నరేష్ గౌడ్

హవేలిఘనపూర్: ఆగి ఉన్న లారీని ట్రాలీ ఆటో ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధి ఔరంగాబాద్ తండా శివారులో బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు...నర్సాపూర్ మండల పరిధి చిన్న చింతకుంట చెందిన గొరి నరేష్ గౌడ్(35) మంగళవారం రాత్రి మెదక్ నుంచి ఆటో జాల్లో పాల ప్యాకెట్లు సరఫరా చేస్తూ వస్తుండగా.. అవుసులపల్లి సమీపంలో నిలిపిన లారీని ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు వివరించారు.

చెరువులో పడి..



శ్రీనివాసచారి

పెద్దశంకరంపేట: పెద్దశంకరంపేటకు చెందిన మెల్ల శ్రీనివాసాచారి(58) ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఏఎస్సై సునీత తెలిపిన వివరాలు.. శ్రీనివాసాచారి టైలరింగ్ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. మంగళవారం గ్రామ శివారులోని పెద్ద చెరువులో స్నానం చేయడానికి వెళ్లి కనిపించకుండా పోయాడు. బుధవారం చెరువులో శవమై తేలాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని వెలికితీశారు. మృతుడి కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

కాలువలో బోర్లాపడి ఊపిరాడక

చిన్నశంకరంపేట: కాలువలో బోర్లాపడి ఊపిరాడక రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధి శాలిపేటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై నారాయణగౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రమేష్(45) మంగళవారం పొలానికి వెళ్లి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం పెద్దమ్మ కుంట సమీపంలో కాలువలో మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చేపలు పట్టడానికి గట్టుపై వెళ్తుండగా.. కాలుజారి పక్కనే ఉన్న కాలువలో బోర్లాపడటంతో ఊపిరాడక ప్రాణాలను కోల్పోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విధులకు వెళ్లి విగతజీవిగా మారి



శివకుమార్

అల్లాదుర్గం: విధులకు వెళ్లిన యువకుడు కుంటలో శవమై తేలిన సంఘటన అల్లాదుర్గం మండలంలోని చేవెళ్ల గ్రామంలో చోటు చేసుకొంది. ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపిన వివరాలు.. శివకుమార్(24) సంగారెడ్డిలోని చిట్‌ఫండ్ కంపెనీలో అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. డబ్బుల విషయంలో పొరపాటు జరగడంతో ఆ సంస్థ అధికారులు ఒత్తిడి తెచ్చినట్లు చెప్పాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈనెల 23న విధులకు వెళ్లి తిరిగి రాకపోవడంతో స్నేహితుల ఇంటికి వెళ్లాడనుకొన్నారు. బుధవారం చేవెళ్ల శివారులోని బతుకమ్మ కుంటలో మృతదేహం కనబడటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం శివకుమార్‌దిగా గుర్తించారు. చిట్‌ఫండ్ డబ్బులు ఎలా చెల్లించాలనే మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో..



పడిగె బాబు

శివ్వంపేట: మద్యానికి బానిసై ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన వ్యక్తి వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపిన వివరాలు.. శివ్వంపేట మండలం శభాష్‌పల్లి గ్రామానికి చెందిన పడిగె బాబు(31) రెండు నెలల నుంచి ఎలాంటి పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. ఆర్థిక ఇబ్బందులతో భార్య మమతతో గొడవపడ్డాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పిల్లిగుండ్ల మత్తడి వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం బాబు మృతదేహం లభించింది. మృతుని భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. బాబుకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

తాగొద్దన్నందుకు తనువు చాలించి



వంశీ..

తూప్రాన్: వినాయకుడి నిమజ్జనంలో మద్యం తాగొద్దన్నందుకు మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన తూప్రాన్ మండలం ఘనపూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. ఘనపూర్ గ్రామానికి చెందిన జంగం వంశీ(18) పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 21న నిమజ్జనం నేపథ్యంలో మద్యం తాగి ఆడొద్దని తల్లి మందలించింది. మనస్తాపం చెందిన వంశీ అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. మేడ్చల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తల్లి బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది.

మెదక్ వైద్య కళాశాలలో ప్రవేశాలు ప్రారంభం



ప్రిన్సిపల్ చేతుల మీదుగా ప్రవేశపత్రం అందుకుంటున్న వైద్య విద్యార్థి

మెదక్: మెతుకుసీమలో ప్రభుత్వ వైద్య విద్యకు అడుగులు పడ్డాయి. మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. 15శాతం ఆల్ ఇండియా కోటాలో నలుగురు విద్యార్థులు ప్రవేశం పొందారు. వీరిలో ఇద్దరు కేరళ, హరియాణా, రాజస్థాన్‌కు చెందిన విద్యార్థులు ఉన్నారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వీరు కళాశాల ప్రిన్సిపల్ రవీందర్‌ను కలిసి ప్రవేశం పొందారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య: డీఈవో

కౌడిపల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సూచించారు. బుధవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి సముదాయక సమావేశంలో మాట్లాడుతూ.. కనీసం చదవడం, రాయడంతోపాటు చతుర్విధ ప్రక్రియలను నేర్పించాలని తెలిపారు. ఏఎంఓ సుదర్శనమూర్తి, నోడల్ అధికారి బాలరాజు, ఆర్పీలు యేషేందర్‌రెడ్డి,మహిపాల్, రమేశ్, నవాజుద్దీన్ పాల్గొన్నారు.

పోలీస్ సిబ్బందికి డ్యూటీ మీట్



పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ మహేందర్

మెదక్, న్యూస్‌టుడే: నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు చేయడానికి సామర్థ్యాలను మెరుగుపర్చుకోవాలని అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో సిబ్బందికి డ్యూటీ మీట్ నిర్వహించారు. చట్టాల అమలు, అంతర్గత భద్రత నైపుణ్యాన్ని పెంపొందించడానికి, నేరాలను శాస్త్రీయంగా గుర్తించడం, దర్యాప్తు చేయడానికి పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, డీసీఆర్బీ సీఐ మధుసూదన్ గౌడ్, ఎస్‌బీ సీఐ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సమయానికి బస్సు రాక.. విద్యార్థుల రాస్తారోకో



చిన్నశంకరంపేట: పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు రాకపోవడంతో బుధవారం గవ్వలపల్లి-రామాయంపేట ప్రధాన రహదారిపై ఖాజాపూర్ వద్ద విద్యార్థులు రాస్తారోకో చేపట్టారు. ఆర్టీసీ అధికారులు హామీ ఇచ్చేంత వరకు విరమించేది లేదని గంటకు పైగా కూర్చున్నారు. స్థానిక నాయకులు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు దృష్టికి తీసుకెళ్లగా. . ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సమయానికి వచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో విరమించారు.

ఎంఈవోల నియామకంతో మేలు: తపస్

చేగుంట, న్యూస్‌టుడే: చాలా ఏళ్ల తర్వాత ప్రతి మండలానికి ఒక ఎంఈవోను నియమించడంవల్ల విద్యావ్యవస్థకు మేలు జరుగుతుందని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. బుధవారం చేగుంట ఎంఈవోగా బాధ్యతలను చేపట్టిన నీరజను సన్మానించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చల్లా లక్ష్మన్, మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రావుల వెంకటేష్, రేఖ, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు విఠల్‌రెడ్డి, నాయకులు నర్సింహారావు, సురేందర్, సుధాకర్‌రెడ్డి, వసంత, రజనిదాస్ తదితరులు పాల్గొన్నారు.

మెదక్: మండలాలకు ఎంఈఓలుగా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను కాకుండా జూనియర్‌లను నియమించడం సరికాదని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్‌రెడ్డి అన్నారు. బుధవారం వారు డీఈవో రాధాకిషన్‌కు వినతి పత్రం అందజేశారు.

- ఎంఈవోల నియామకం హర్షించదగిన పరిణామం అని పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా వ్యవస్థలో ఇదొక శుభ పరిణామమని అన్నారు.

రైస్‌మిల్లు వ్యాపారి ఆస్తుల వేలం

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ పట్టణానికి చెందిన రైస్‌మిల్లు వ్యాపారి పైడి శ్రీధర్ గుప్తా ప్రభుత్వానికి ధాన్యం బకాయిలు రూ.47.17కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ సందర్భంగా ఆయన స్థిరాస్తులను బుధవారం బహిరంగ వేలం వేశారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఉప తహసీల్దార్లు మహేష్, ఆదర్శ్‌కుమార్ సమక్షంలో లింగాపూర్, మాదాపూర్ సమీపంలోని వ్యవసాయ భూముల వేలం నిర్వహించారు. ఇందులో 1.31ఎకరాల భూమిని అత్యధికంగా రూ.2.12కోట్లకు కొందరు వేలంలో దక్కించుకున్నారని తహసీల్దార్ తెలిపారు. సీనియర్ సహాయకులు స్వామి, ఆర్ఐలు సిద్ధిరాంరెడ్డి, ఫైజల్ మహ్మద్ ఉన్నారు.

వనదుర్గమ్మ చెంతకు గంగమ్మ



ఆలయం ముందు వరద ప్రవాహం



రాజగోపురంలో పూజలందుకుంటున్న దుర్గమ్మ

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద రెండో రోజు వరద ప్రవాహం కొనసాగింది. దీంతో బుధవారం తెల్లవారుజామున అర్చకులు మాత్రమే ఆలయంలోకి వెళ్లి అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన అనంతరం ఆలయాన్ని మూసివేశారు. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 15,155 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

తాగు నీటి ట్యాంకులు శుభ్రంగా ఉంచండి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

మెదక్ రూరల్: గ్రామాల్లోని నీటి ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వాటర్‌మెన్‌లకు మోటార్ల నిర్వహణ, ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరా గురించి అవగాహన కల్పించారు. పైప్‌లైన్లు పగిలితే వెంటనే మరమ్మతులు చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ సంపత్, డీఈ పల్లవి, ఏఈలు రాజు పాల్గొన్నారు.

నేడు యోగా శిక్షకులకు ముఖాముఖి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో ఉన్న ఆరోగ్య స్వస్థత కేంద్రాల్లో యోగా శిక్షకుల భర్తీకి నేడు మెదక్ పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో ముఖాముఖి నిర్వహించనున్నట్లు వైద్యాధికారిణి మధుమిత తెలిపారు. మెదక్ జిల్లాలో పురుషులు-14, మహిళలు-14, సిద్దిపేట జిల్లాలో పురుషులు-16, మహిళలు-16, సంగారెడ్డి జిల్లాలో పురుషులు-14, మహిళలు-14 చొప్పున ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 88 మందిని ఎంపిక చేయనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉదయం 10.30 గంటలలోపు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

తక్షణ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: మెదక్ ప్రభుత్వ ఐటీఐలో మిగిలిపోయిన సీట్లలో తక్షణ ప్రవేశాలకు ఈనెల 25 నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంప్రదించాలని ప్రిన్సిపల్ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు https///iti.telangana.gov.in దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నర్సాపూర్, శివ్వంపేటలో చెరువుల సర్వే

నర్సాపూర్, న్యూస్‌టుడే: హెచ్ఎండీఏ పరిధిలోని మండలాలైన నర్సాపూర్, శివ్వంపేటలలో చెరువుల సర్వే కొనసాగిస్తున్నామని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను గుర్తిస్తున్నామన్నారు. నర్సాపూర్‌లో 164, శివ్వంపేటలో 162 మొత్తం 326 నీటి వనరులుండగా 311 వాటికి సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ విడుదల చేసినట్లు చెప్పారు.

వైద్య సేవల్లో ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



రాందాస్ చౌరస్తాలో ఫార్మాసిస్ట్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు రాజు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: రోగులకు సేవలందించడంలో ఫార్మాసిస్టులు తమదైన పాత్ర పోషిస్తున్నారని రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు తోడుపునూరి రాజు అన్నారు. బుధవారం ప్రపంచ ఫార్మసిస్ట్ దినోత్సవం పురస్కరించుకొని మెదక్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంగమేష్, మెదక్ ఏరియా అధ్యక్షుడు రాగం శ్రీనివాస్, కార్యదర్శి శేషాచారి, కోశాధికారి రాధాకిషన్, కోఆర్డినేటర్ జుబేర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్: ప్రజల ఆరోగ్య సంరక్షణలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమైందని తెలంగాణ డ్రగ్ ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అన్నారు. నర్సాపూర్‌లోని విష్ణు ఫార్మసీ కళాశాలలో ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. మెదక్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, నిశాంత్, ప్రిన్సిపల్ డాక్టర్ రమేశ్ తదితరులు మాట్లాడారు. కన్వీనర్ రాజశేఖర్, సమన్వయకర్త నవీన్ తదితరులున్నారు.

నాణ్యత ఆరు నెలలేనా!



తిమ్మాపూర్ శివారులో జాతీయ రహదారిపై ఒక వైపు కూలిన రాళ్లు


న్యూస్‌టుడే, దుబ్బాక: హనుమకొండ, సిద్దిపేట, మెదక్ జిల్లాలను కలుపుతూ మెదక్ నుంచి ఎల్కతుర్తి(సిద్దిపేట మీదుగా) వరకు నిర్మిస్తున్న జాతీయ రహదారి పనుల్లో నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆరు నెలల క్రితమే దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్ శివారులో చేపట్టిన పనుల్లో నాణ్యత సరిగా లేక రహదారికి ఒకవైపున ఏర్పాటు చేసిన రాళ్ల తెట్టె (స్టోన్ రివెట్‌మెంట్) ఇటీవల కురిసిన వర్షాలకు కూలిపోయింది. దీంతో వాహన చోదకులు నాణ్యతపై ప్రశ్నిస్తున్నారు.

మట్టి దిబ్బలు కూలకుండా..

8 అడుగుల లోతులో తవ్వి రహదారి నిర్మాణం చేపట్టారు. రహదారికి ఇరువైపులా పెద్ద మురుగు కాల్వలను నిర్మించారు. వీటికి ఇరువైపులా 8 అడుగుల మేర ఎత్తులో మట్టి దిబ్బలు కిందికి కూలకుండా 100 మీటర్ల మేర పెద్ద రాళ్లతో తెట్టెను ఏర్పాటు చేశారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలకు ఒక వైపున కొంత భాగం కూలిపోయి, రాళ్లన్ని మురుగు కాల్వ దిమ్మెలపైన, కాల్వ లోపల పడిపోయాయి. దీంతో 6 నెలల క్రితం ఏర్పాటు చేసిన పనుల్లో నాణ్యత లోపించిందని చోదకులు చెబుతున్నారు. తక్షణమే ఎన్‌హెచ్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ఎన్‌హెచ్ డీఈ డి.అన్నయ్యను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వారం రోజుల్లో మరమ్మతులు చేయిస్తామని వెల్లడించారు.

పటిష్ఠ పర్యవేక్షణ

అన్ని మండలాలకు ఎంఈవోల నియామకం



న్యూస్‌టుడే-మెదక్: ప్రతి మండలానికి విద్యాధికారుల నియామకంతో విద్యా వ్యవస్థ గాడిలో పడనుంది. గత కొన్నేళ్లుగా నియామకం లేక ఇబ్బందులు ఎదురుకాగా, ప్రస్తుతం వారి రాకతో పర్యవేక్షణ మరింత పెరగడంతో విద్యా రంగం బలోపేతం కానుంది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న కార్యక్రమాలు మరింత పకడ్బందీగా నిర్వహించనున్నారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం...

ముగ్గురితో నెట్టుకురాగా...

జిల్లాలో 21 మండలాలు ఉన్నాయి. ఇటీవల వరకు జిల్లాలో కేవలం ముగ్గురు మండల విద్యాధికారులు మాత్రమే విధులు నిర్వహించారు. మెదక్, హవేలిఘనపూర్, కొల్చారం, పాపన్నపేట, టేక్మాల్, నిజాంపేట, రామాయంపేట మండలాలకు ఎంఈవోగా నీలకంఠం, నర్సాపూర్, కౌడిపల్లి, చిలప్‌చెడ్, శివ్వంపేట, చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, అల్లాదుర్గం, రేగోడ్, చేగుంట, నార్సింగి, తూప్రాన్, మనోహరబాద్ మండలాలకు బుచ్చానాయక్, వెల్దుర్తి, మాసాయిపేట మండలాలకు యాదగిరి ఎంఈవోగా కొనసాగారు. ఒక్కొక్కరిపై ఎక్కువ మండలాలను పర్యవేక్షించే బాధ్యత ఉండడంతో ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారుల సమీక్షల కారణంగా పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది.

పూర్తి బాధ్యతలు

ఎంఈవోకు ఎక్కువ మండలాలు ఉండడంతో వారికి సహాయకంగా ప్రభుత్వం ఐదేళ్ల క్రితం ప్రధానోపాధ్యాయులను మండల నోడల్ అధికారులుగా నియమించింది. వీరు ఎంఈవోలకు సంబంధించిన కొన్ని అంశాలు పర్యవేక్షించేవారు. కానీ నోడల్ అధికారులను ఉపాధ్యాయులు లెక్కచేయడం లేదనే విమర్శలున్నాయి. దీంతో పాఠశాలలపై పర్యవేక్షణ తగ్గి విద్యా ప్రమాణాలు కుంటుపడ్డాయి. ఈ పరిస్థితులు గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి మండలానికి సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులను ఎంఈవోలుగా నియమిస్తూ పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. దీంతో జిల్లాలో ప్రస్తుతం ఉన్న ముగ్గురు ఎంఈవోలతో పాటు మిగిలిన 18 మండలాలకు నియామకం జరిగింది. సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకే ఎంఈవోగా బాధ్యతలను అప్పగించగా, నార్సింగి, మాసాయిపేట మండలాలకు ప్రస్తుతం మండల నోడల్ అధికారులుగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ వారు ఉన్నారు. ఈ రెండు మండలాలు మినహా మిగిలిన వారు బుధవారం బాధ్యతలు చేపట్టారు.

కొత్త మండలాల్లో..

ప్రస్తుతం జిల్లాలో ఆరు కొత్త మండలాలు ఏర్పడగా, పాత 15 మండలాల్లో మండల వనరుల కేంద్రాలు(ఎంఆర్‌సీ) ఉన్నాయి. అందులో ఎంఈవో, సిబ్బంది అందుబాటులో ఉండనున్నారు. కొత్త మండలాల్లో భవనాలు లేకపోవడంతో తాత్కాలికంగా మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో గదిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యా వ్యవస్థ మరింత బలోపేతం



రాధాకిషన్, జిల్లా విద్యాధికారి

ఇరవై ఏళ్ల తర్వాత మండలాలకు విద్యాధికారుల నియామకం జరిగింది. వీరి రాకతో విద్యావ్యవస్థ మరింత బలోపేతం కానుంది. నార్సింగి, మాసాయిపేట మండలాలకు నియమితులైన వారు స్కూల్‌అసిస్టెంట్ కేడర్ కావడంతో రెండింటిని హోల్డ్‌లో పెట్టాలని ఆదేశాలు వచ్చాయి.

ప్రతి కుటుంబానికి స్మార్టు కార్డు

వచ్చే నెల నుంచి సర్వే • మంత్రి కొండా సురేఖ

సిద్దిపేట, న్యూస్‌టుడే: ప్రతి కుటుంబానికి ప్రత్యేకంగా ఫ్యామిలీ స్మార్ట్ (డిజిటల్) కార్డు అందించే దిశగా వచ్చే నెల నుంచి సర్వే మొదలవనుందని, రేషన్ కార్డులు అందించేందుకు అడుగులు పడనున్నాయని రాష్ట్ర పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖల, సిద్దిపేట జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఒకే కార్డుపై ప్రభుత్వ పథకాలు అందే విధంగా శ్రీకారం చుట్టబోతుందన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో జిల్లా అభివృద్ధి-సంక్షేమ పథకాలపై బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్మార్ట్ కార్డు ద్వారా కుటుంబానికి సంబంధించి అన్ని వివరాలు తెలుసుకోవచ్చని, అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు. పింఛను, రేషన్, హెల్త్ ప్రొఫైల్, ప్రభుత్వ పథకాలన్నింటికి ఉపయోగపడుతుందన్నారు. ఒకవేళ ఆసుపత్రికి వెళ్లినా ఆరోగ్య స్థాయి వివరాలు సులువుగా తెలుస్తాయని, చికిత్స సత్వరం అందుతుందన్నారు. ప్రజా పాలనలో తీసుకున్న దరఖాస్తుల్లో దాదాపు ఐదు అంశాలను అమలు చేసినట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3500 చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, మార్గదర్శకాలు రాగానే అమలు చేస్తామన్నారు. పర్యావరణ, ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారని తెలిపారు. నిధుల లేమి సమస్య ఎక్కువగా ఉందని, విధుల యున వెంటనే పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన అంశాలు కలెక్టర్ పరిధిలో ఉంటే త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, దేశపతి శ్రీనివాస్, దుబ్బాక, జనగామ, మానకొండూరు ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, కలెక్టర్ మనుచౌదరి, అధికారులు పాల్గొన్నారు.

బోధన భళా.. కొలువుల కళ

ఒకే కళాశాల నుంచి 87 మంది ఏఈఈలు



నీటిపారుదల శాఖలో ఉద్యోగాలకు ఎంపికైన కళాశాల విద్యార్థులు



న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సంగారెడ్డి టౌన్, కంది: వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల.. ఎన్నో ఆశలతో ఇక్కడ చదివారు. అధ్యాపకుల బోధన.. విద్యార్థులు కష్టపడి చదవారు. వీరిలో కొందరు వ్యవసాయ శాఖలో ఏఈఓలుగా పని చేస్తున్నా పెద్ద ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగారు. నిరంతరం లక్ష్య సాధనకు కృషి చేశారు. కష్టపడి చదవడంతో వారికి ఇష్టమైన నీటి పారుదల శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఏఈఈ)గా ఉద్యోగాలు సాధించారు. రైతులకు మరింత సేవ చేసేందుకు తమకు అవకాశం దక్కిందని ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల ఘనత.. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ పత్రాలు అందుకోనున్నారు. ఈ నేపథ్యంలో 'న్యూస్‌టుడే' కథనం.

బ్యాంకు ఉద్యోగం మానేసి..

– శరత్‌చంద్ర



మాది మహబూబ్‌నగర్ జిల్లా. తల్లిదండ్రులు చంద్రశేఖర్- పోచమ్మ. వ్యవసాయం చేస్తూ చదివించారు. నేను ఎంబీఏ చదివి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో ఉద్యోగం చేశా. నాన్న కోరిక మేరకు వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చేరా. ఆశించిన నీటిపారుదల శాఖలో ఏఈఈ పోస్టుకు ఎంపికయ్యాను.

నాణ్యతతో సుసాధ్యం

కందిలోని వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాల ప్రత్యేకతను సంతరించుకుంది. ఇక్కడ చదివిన 87 మంది నీటి పారుదల శాఖలో ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. రాష్ట్రంలోనే అత్యధిక మంది ఒకేసారి ఎంపికైన ఘనతను కళాశాల దక్కించుకుంది. గతంలో అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడ్డారు. మూడేళ్ల క్రితం వివిధ రూపాల్లో నియామకాలు చేపట్టి అధ్యాపక పోస్టులు భర్తీ చేయించుకున్నారు. నిష్ణాతులైన అధ్యాపక బృందం.. నాణ్యమైన బోధన విద్యార్థులకు ఉద్యోగాలు దక్కించుకునేందుకు దోహద పడ్డాయి. వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నిరూపించారు. భవిష్యత్‌లో ఈ కళాశాలలో చేరే విద్యార్థులకు దిక్సూచిగా నిలిచారు.

లక్ష్య సాధనకు కృషి

– మాన్యరెడ్డి

మాది మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం. తండ్రి వాసురెడ్డి, వ్యవసాయ కుటుంబం మాది. వ్యవసాయ విస్తరణ అధికారిగా పని చేస్తూనే ఇక్కడ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో చదివా. వ్యవసాయంలో రైతులకు కొత్త పద్ధతులకు సంబంధించి సూచనలు సలహాలు ఇవ్వచ్చని. ఉన్నత ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో ప్రణాళికతో చదివా.

అమ్మానాన్నల ఆశయం

– భవాని



మాది సూర్యాపేట. మా తల్లిదండ్రులు గురుమూర్తి-పద్మావతి. ప్రభుత్వ ఉద్యోగం రావాలన్న అమ్మానాన్నల కోరిక. చిన్నతనం నుంచి కష్టపడి చదివిన నిరంతరం గుర్తు చేసుకునేదాన్ని. అధ్యాపకులు సందేహాలు ఎప్పటికప్పుడు నివృత్తి చేసేవారు. చదువు పూర్తి కాగానే ఏఈఈ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

ఆర్ద్రా మహోత్సవ వైభవం



కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: సిద్దిపేట జిల్లా కొండపాక మండలం మర్పడ్గలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో బుధవారం ఆర్ద్రా మహోత్సవం వైభవంగా జరిగింది. క్షేత్ర నిర్వాహకుడు చెప్పెల హరినాథశర్మ వైదికుల పర్యవేక్షణలో గణపతి పూజ, పాశుపత అభిషేకం, విశేషార్చన, హోమం, పూర్ణాహుతి జరిగాయి. భక్తులు విజయదుర్గను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

28న ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ ఎంపికలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడా సమాఖ్య(ఇంటర్మీడియట్) ఆధ్వర్యంలో ఈ నెల 28న మెదక్‌లోని గాంధీ మైదానంలో ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ అండర్-19 ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి గణపతి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు పదో తరగతి మెమో, బోనఫైడ్, జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డుతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని కోరారు.

స్వచ్ఛ ఆకృతి.. స్ఫూర్తి



స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలోని ఫుట్‌బాల్ మైదానంలో విద్యార్థినులు 'ఎస్‌హెచ్‌ఎస్' అక్షరాల ఆకృతిలో బుధవారం ప్రదర్శన చేపట్టారు. 40 మీటర్ల పొడవు, 20 మీటర్ల వెడల్పు ఉన్న ఈ మైదానంలో మొత్తం 500 మంది విద్యార్థినులు కేవలం 40 నిమిషాల్లో క్రమశిక్షణగా ప్రదర్శనలో కూర్చున్నారు. అంతకు ముందు వారు శ్రమదానం చేశారు. పారిశుద్ధ్య పర్యవేక్షకురాలు వనిత ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేశారు. చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

చారిత్రక ప్రదేశాలే సంపద

సంగారెడ్డి టౌన్, న్యూస్‌టుడే: చారిత్రక ప్రదేశాలు, సాంస్కృతిక వారసత్వమే తరగని సంపద అని సంగారెడ్డిలోని తారా ప్రభుత్వ కళాశాల వైస్ ప్రిన్సిపల్ జగదీశ్వర్ అన్నారు. కళాశాల యువ, పర్యాటక క్లబ్, చరిత్ర విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు బుధవారం నిర్వహించారని చెప్పారు. 'నాకు నచ్చిన పర్యాటక ప్రదేశం' అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'పర్యాటక రంగ అభివృద్ధిలో యువత పాత్ర' అంశంపై ఉపన్యాసం, 'పర్యావరణహిత సుస్థిర పర్యాటక రంగం' అంశంపై పోస్టర్ పెయింటింగ్ పోటీలు ఏర్పాటు చేశారు.

విలువ పెంచే మూలాలు

మూలాలను మరిచిపోయి ఎంతగా ఎదిగినా జీవితాన్ని మోసపుచ్చినట్టే లెక్క... ప్రముఖులు యువతకు సూచించే విషయమిది. ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినా, ఇతర రంగాల్లో స్థిరపడినా కొందరు అంతకు ముందు తాము ఏ విధులు నిర్వర్తించే వారో మరచిపోకుండా తరచుగా వాటిని చేపడుతుంటారు. నైపుణ్యం చెక్కుచెదరకుండా చూసుకుంటారు. ఈ కోవలోనే వృత్తి, ప్రవృత్తులతో ముందడుగు వేస్తున్న కొందరి జీవన గమనంపై 'న్యూస్‌టుడే' కథనం.

వడ్రంగి.. నైపుణ్యమండీ



పరికరాలు తయారు చేస్తున్న కృష్ణ

కొడంగల్, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం ఇందనూర్ గ్రామానికి చెందిన వడ్ల ముద్దప్ప, లక్ష్మమ్మ దంపతుల కుమారుడు వడ్ల కృష్ణ. ఎంఏ, డీఈడీ చేసి ప్రస్తుతం బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం బోధిస్తున్నారు. తాత బాలప్ప, తండ్రి ముద్దప్ప వద్ద కృష్ణ వడ్రంగి పనులను చిన్నప్పుడు నేర్చుకున్నారు. నాగలి, గొర్రు, గుంటుక వంటి వ్యవసాయ పరికరాలను తయారు చేయడం, సీజన్‌లో మరమ్మతులు చేస్తున్నారు. జొన్నలు, వడ్లు, ఇతర పంటలను రైతులు కృష్ణ కుటుంబానికి అందిస్తారు.

వారసత్వ ఇస్త్రీ

తాండూరు టౌన్: వాళ్లు ముగ్గురు అన్నదమ్ములు.. ప్రభుత్వ ఉపాధ్యాయులు. కుల వృత్తి స్ఫూర్తితోనే తాము ఉపాధ్యాయులుగా ఎదిగామని నమ్మి పనిని కొనసాగిస్తున్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణానికి చెందిన రమేశ్.. యాలాలలోని ప్రభుత్వ పాఠశాలలో, రాజేశ్.. హాజీపూర్‌లో, శ్రీనివాస్.. పెద్దేముల్ మండలం మంబాపూరులో ఉపాధ్యాయులుగా బోధిస్తున్నారు. సాయంత్రం పాఠశాల సమయం పూర్తి కాగానే మగ్గురూ తమ ఇళ్ల వద్ద ఇతరుల దుస్తులను ఇస్త్రీ చేస్తున్నారు. ఎంత ఎదిగినా భేషజానికి పోకుండా వారసత్వంగా వృత్తి నైపుణ్యాలు ఉంటే జీవితం సంతృప్తిగా ఉంటుందని వారు తెలిపారు.



శ్రీనివాస్



రమేశ్



రాజేశ్

ఆదాయం మెరుగు పరిచే బజ్జీ



బజ్జీలు వేస్తున్న కృష్ణ

తాండూరు: వికారాబాద్ జిల్లా పెద్దేముల్ గ్రంథాలయ సహాయకుడు కృష్ణ రోజూ విధులు ముగియగానే అదనపు సంపాదనకు బజ్జీలు వేస్తూ విక్రయిస్తున్నారు. వారు ఐదుగురు కుటుంబ సభ్యులు. 2009లో పొరుగుసేవల విధానంలో ఉద్యోగంలో చేరారు. రాత్రి 7 గంటల వరకు విధుల్లో ఉంటారు. తర్వాత 12 కి.మీ. దూరంలోని తాండూరులో రాత్రి 8 గంటల నుంచి బజ్జీల విక్రయ దుకాణం తెరుస్తారు. బజ్జీల విక్రయంతో ఆదాయం చేదోడుగా ఉంటోందని తెలిపారు.

ఆధ్యాత్మికం.. పరవశం



శ్రీశైలంలో పాల్గొన్న భక్తులు

న్యూస్‌టుడే, దోమ: 'ఏ తీరుగ నను దయ చూసెదవో ఇనవంశోత్తమ రామా..', 'శివ శివ యనరాదా మనసా..' ఇలా దేవాలయాలు, మఠాల్లో భజనలు భక్తితత్పరతతో మార్మోగుతుంటాయి. కీర్తనలను, పాటలను పాడటానికి కొన్ని ప్రాంతాల్లో ప్రత్యేకంగా భజన మండళ్లు ఉన్నాయి. వివిధ గ్రామాల్లోని గుళ్లలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతారు. అక్కడ రాకమచర్ల కీర్తనలు, భక్త తుకారం, రామాయణం, పాండురంగడి భజనలు, తత్వాలు పాడతారు. సాధారణంగా పుణ్యదినాలు, పండుగలు, శని, ఆది, సోమ వారాల్లో కార్యక్రమాలు ఉంటాయి. వికారాబాద్ జిల్లా దోమ మండల పాలేపల్లికి చెందిన శ్రీరామాంజనేయ భజన మండలి భక్తులు పూర్వీకుల నుంచి ఈ ఆచారాన్ని అనుసరిస్తున్నారు. యువతను సన్మార్గంలో నడిపించేందుకు ఆధ్యాత్మిక పాటలు, పద్యాలు, పండగలపై ప్రవచనాలను సాధన చేయిస్తున్నారు. వీరి ప్రతిభను గుర్తించి జిల్లాలోని తాండూరు భద్రేశ్వరస్వామి, కొడంగల్ శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలు, చేవెళ్లలోని శంకరమ్మ మాత, వికారాబాద్‌లోని బుగ్గరామేశ్వరం, కుల్కచర్ల మండలం ఏకశిల పర్వత ఉత్సవాల సందర్భంగా మండలి భక్తులను ఆహ్వానిస్తారు. గత వారం శ్రీశైల దేవస్థానం నుంచి ఆహ్వానం అందుకున్నారు. అక్కడ తమ భజన సంకీర్తనల ప్రతిభను చాటుకున్నారు. గతేడాది స్వర్గీయ కొండా మాధవరెడ్డి స్మారకార్థం భజన పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానం దక్కించుకున్నారు. గ్రామంలో వీరితో పాటు సీతారామచంద్ర మహిళ భజన మండలి కూడా ఉంది.



చంద్రశేఖరాచార్యులను సన్మానిస్తున్న రేగోడ్ మఠం బాధ్యులు

సనాతన ధర్మాన్ని కాపాడాలి

రేగోడ్: హిందూ సనాతన ధర్మాన్ని, ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి హిందువుపై ఉందని కడప జిల్లా కందిమల్లయ్యపల్లిలోని వీరబ్రహ్మం సంస్కృత వేద పాఠశాల ప్రధానాచార్యుడు చంద్రశేఖరాచార్యులు అన్నారు. మెదక్ జిల్లా రేగోడ్‌లోని బ్రహ్మంగారి మఠాన్ని బుధవారం సందర్శించి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఘటనలు, దాడులను తీవ్రంగా పరిగణించి నిందితులపై చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం బ్రహ్మంగారి మఠం కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి ఆత్మహత్య

ప్రేమించిన అమ్మాయి దక్కదని యువకుడు..



అనిల్ కుమార్

ములుగు, న్యూస్‌టుడే: వారిద్దరు ప్రేమించుకున్నారు. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలనుకున్నారు. విషయం అమ్మాయి మేనమామలకు తెలియడంతో వారు పెళ్లికి నిరాకరించారు. కోరుకున్న అమ్మాయి దక్కదని భావించిన ఆ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ ఎస్ఐ దామోదర్ తెలిపిన వివరాలు.. మర్కూక్ మండలం పాతూరు గ్రామానికి చెందిన అనిల్‌కుమార్(19) హైదరాబాద్‌కు చెందిన ఓ యువతిని ప్రేమించాడు. ఆ యువతి అతడి కంటే ఏడాది పెద్దది. ఆమె అమ్మమ్మగారిల్లు కూడా పాతూరే. గతేడాది ఆమె ఇక్కడికి వచ్చినప్పుడు అనిల్ కుమార్‌తో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. పెద్దలతో మాట్లాడి పెళ్లి చేసుకుందామని ప్రేమికులిద్దరూ నిర్ణయించుకున్నారు. ఇదే విషయాన్ని యువకుడి తండ్రి కిష్టయ్య అమ్మాయి మేనమామల దృష్టికి తీసుకెళ్లగా వారు నిరాకరించారు. విషయం ఇంతటితో వదిలి పెట్టాలని, అమ్మాయి జోలికి మళ్లీ రాకూడదని మందలించారు. ప్రేమించిన అమ్మాయి దక్కదని తెలుసుకున్న అనిల్ కుమార్ ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఆర్వీఎం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తన కొడుకు మృతికి అమ్మాయి మేనమామలు కారణమంటూ అనిల్ కుమార్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


మద్యానికి బానిసై డ్రైవర్..



పరశు రాములు

కొండపాక గ్రామీణం, న్యూస్‌టుడే: మద్యానికి బానిసై కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి పరశురాములు(40) పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు.. పరశురాములు వృత్తిరీత్యా డ్రైవర్. ఏడాదిగా మద్యానికి బానిసై ఏ పని చేయకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. 20 రోజుల క్రితం మద్యం తాగి ఇంటికొచ్చి భార్య వాణితో వాగ్వాదానికి దిగడంతో ఆమె తన పుట్టింటికి(జప్తినాచారం) వెళ్లారు. మనస్తాపానికి గురై బుధవారం తన వ్యవసాయ బావి వద్ద ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన స్థానికులు అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కుటుంబ సమస్యలతో కార్మికుడు..



నాగరాజు

దుబ్బాక, న్యూస్‌టుడే: ఒంటికి నిప్పంటించుకుని దుబ్బాక పట్టణానికి చెందిన బెల్లె నాగరాజు(45) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నాగరాజు వెల్డింగ్ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. భార్య సునీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ సభ్యులతో గొడవలు పడుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పటించుకున్నాడు. మంటలకు తాళలేక కేకలు వేయడంతో వెంటనే కుటుంబ సభ్యులు అప్రమత్తమై మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. 108 వాహనంలో సిద్దిపేటకు, అక్కడ్నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ ఘటనపై దుబ్బాక ఎస్సై గంగరాజును వివరణ కోరగా ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ దుర్మరణం

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన ఘటన సిద్దిపేటలో చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... పట్టణంలోని రేణుకానగర్‌కు చెందిన కూచన్ మహేశ్వరి (50) ప్రధాన రహదారి బుధవారం డివైడర్ దాటుతుండగా వేములవాడ కమాన్ వైపు ఓ యుకువడు ద్విచక్రవాహనంపై వస్తూ ఆమెను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆమెకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానికులు ప్రభుత్వం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహేశ్వరి మృతిచెందింది. కుమారుడు భానుప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

పిడుగుపాటుతో ఒకరి మృతి



జాటి పటేల్

గుమ్మడిదల, న్యూస్‌టుడే: పిడుగుపడి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం అన్నారం పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అన్నారానికి చెందిన కుమ్మరి అశోక్ వద్ద ఒడిశా రాష్ట్రం నవాపాడ జిల్లా గోడల్ గ్రామానికి చెందిన జాటి పటేల్(36) మూడు నెలలుగా వ్యవసాయ పనులు చేస్తున్నాడు. 24వ తేదీన ఆయన గేదెలు మేపడానికి పొలానికి వెళ్లారు. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. రాత్రయినా జాటి పటేల్ ఇంటికి రాకపోవడంతో యజమాని అశోక్ చరవాణిని సంప్రదించగా ఎత్తలేదు. గేదెలు మాత్రం ఇంటికి వచ్చాయి. పొలం వద్దకు వెళ్లి వెతికినా ఆచూకి లభించలేదు. బుధవారం ఉదయం మళ్లీ వెళ్లి చూడగా డంప్‌యార్డు వద్ద విగత జీవిగా పడి ఉన్నాడు. పిడుగుపాటుతో మృతిచెందినట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నిరీక్షణకు తెర

గిరిజన గురుకుల డిగ్రీ ప్రవేశాలకు ఆహ్వానం

న్యూస్‌టుడే, సంగారెడ్డి టౌన్:

గిరిజనులను పేదరికం నుంచి గట్టెక్కించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా సంగారెడ్డిలో నాలుగేళ్ల కిందట గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. ఇక్కడ సొంత భవనం లేకపోవడంతో రెండేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం పెద్దకంజర్ల శివారులోని ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు తరలించారు. రెండు సంవత్సరాలుగా ప్రవేశాల ప్రక్రియను నిలిపివేసింది. తాజాగా ప్రభుత్వం ప్రవేశాలకు అనుమతించిన నేపథ్యంలో కథనం. రెండు సంవత్సరాలుగా ప్రవేశాలు లేకపోవడంతో ఈ విద్యా సంవత్సరం ఉంటాయో లేవో తెలియని పరిస్థితి. చాలామంది విద్యార్థులు ఇతర కళాశాలలో ఇప్పటికే చేరారు. ప్రవేశాలకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గిరిజన విద్యార్థులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. ఈనెల 27 లోగా ప్రవేశాలు పొందాలని సూచించడమే దీనికి కారణం. దరఖాస్తులకు మూడు రోజుల సమయం మాత్రమే ఇచ్చారు. గడువు తేదీని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కాలేజీలోని నాలుగు కోర్సుల్లో మొత్తం 240 సీట్లు ఉన్నాయి.



సద్వినియోగం చేసుకోవాలి

– మహేశ్వరి, ప్రిన్సిపల్

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ప్రభుత్వం అవకాశం కల్పించిన నేపథ్యంలో విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. గిరిజన గురుకులంలో డిగ్రీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుంది. వివరాలకు 96422 86686, 97059 92496, 80080 70959 ఫోన్లలో సంప్రదించాలి.

కోర్సులు: • బీఎస్సీ (ఫిజికల్ సైన్స్) • బీఎస్సీ (లైఫ్ సైన్సెస్) • బీకాం (సీఏ) • బీకాం (ఆనర్)

ప్రత్యేకతలు:

- గిరిజనులకు ఉమ్మడి మెదక్ జిల్లాలో ఏకైక గురుకుల డిగ్రీ కళాశాల ఇది
- ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్ ఉన్నాయి.
- క్రీడల్లో ప్రోత్సాహం
- వైఫై సదుపాయంతో కంప్యూటర్ ల్యాబ్
- డిజిటల్ గ్రంథాలయం
- ఉచిత వసతి, నాణ్యమైన భోజనం

నారింజ వాగులో వ్యక్తి గల్లంతు!

వాహనంతో ప్రవాహం దాటుతుండగా ప్రమాదం

జహీరాబాద్ అర్బన్, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంతో వాగు దాటుతూ వరద ఉద్ధృతికి వ్యక్తి గల్లంతవగా మరొకరు నీటిలో కొట్టుకుపోతూ చెట్ల కొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి బూచినెల్లి వద్ద నారింజ వాగు పొంగింది. కర్ణాటకలోని బీదర్ పట్టణ శివారులోని మైలూరుకు చెందిన షాకీర్(40) ద్విచక్ర వాహనంపై ఆయన ఇంటి పక్కన ఉండే ఇస్మాయిల్(60)తో కలిసి జహీరాబాద్ వైపు వస్తున్నారు.



వాగులో కొట్టుకుపోతున్న ఇస్మాయిల్, (వృత్తంలో) షాకీర్

ఇస్మాయిల్‌ను రక్షించిన గ్రామస్థులు

బూచినెల్లి సమీపంలోకి రాగానే నారింజ వాగు వంతెన మీదుగా పారుతున్న వరద ఉద్ధృతిని అంచనా వేయకుండా వాహనాన్ని ముందుకు పోనిచ్చాడు. మధ్యలోకి రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో షాకీర్ నీటిలో కొట్టుకుపోగా... ఇస్మాయిల్ పక్కనే చెట్లకొమ్మలు పట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నాడు. వాగులో చెట్లకొమ్మలు పట్టుకుని నీళ్లలో ఉన్న ఇస్మాయిల్‌ను గ్రామస్థులు గుర్తించి రక్షించారు. వ్యక్తి గల్లంతు విషయం తెలుసుకున్న జహీరాబాద్ తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, ఆర్ఐ రుక్మొద్దీన్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఘనపూర్-జహీరాబాద్ మార్గంలో రాకపోకలు నిషేధించారు.

నకిలీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠా పట్టివేత



పట్టుబడిన నిందితులతో పోలీసులు

కుల్కచర్ల: కల్తీ అల్లం, వెల్లుల్లి తయారీ ముఠాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకొని 9 క్వింటాళ్ల 38 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్, 2 క్వింటాళ్ల వెల్లుల్లిని స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై అన్వేష్‌రెడ్డి తెలిపిన వివరాలు.. టాస్క్‌ఫోర్స్ పోలీసులకు అందిన సమాచారం మేరకు మంగళవారం చౌడాపూర్ మండల కేంద్రంలో శశిధర్ కిరాణ దుకాణాన్ని తనిఖీ చేశారు. అక్కడ నకిలీ అల్లం, వెల్లుల్లి డబ్బాలు లభించాయి. శశిధర్‌ను విచారించగా.. మహబూబ్‌నగర్‌కు చెందిన బాలకృష్ణ, వెంకటేశ్వర్లు నుంచి కొన్నట్లు తెలిపారు. వారికి కీసర మండల కేంద్రానికి చెందిన దామోదర్‌రెడ్డి సరఫరా చేసినట్లు తేలింది. దామోదర్‌రెడ్డి హైదరాబాదులో ముకుంద జింజర్, గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీని నడుపుతున్నాడు. అందులోనే సిట్రిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, టెస్టింగ్ సాల్ట్‌లతోపాటు కుళ్లిపోయిన వెల్లుల్లి లభించాయి. నిందితులపై కేసు నమోదైంది.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125-00	డ్రెస్డ్ 213-00	
రిటైల్ 147-00	స్కిన్‌లెస్ 243-00	

ఎంఈవోల బాధ్యతల స్వీకరణ

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో నూతన ఎంఈవోలుగా పలువురు ఉపాధ్యాయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. చేగుంట ఎంఈవోగా నీరజ బాధ్యతలు చేపట్టిన అనంతరం మెదక్ డీఈవోను కలిసేందుకు వెళ్లారు. నర్సాపూర్ ఎంఈవోగా తారాసింగ్, పాపన్నపేట ఎంఈవోగా ప్రతాప్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. రేగోడ్ ఎంఈవో గురునాథ్, అల్లాదుర్గం ఎంఈవోగా ధనుంజయ, టేక్మాల్ ఎంఈవో సుజాత, కౌడిపల్లిలో బాలరాజు, చిలప్‌చెడ్ ఎంఈవోగా విట్టల్, చిన్నశంకరంపేట ఎంఈవోగా పుష్పవేణి, కొల్చారంలో సత్యనారాయణరావు, హవేలిఘనపూర్‌లో మధుమోహన్, మనోహరాబాద్‌లో మల్లేశం బాధ్యతలు స్వీకరించారు. ఎంఈవోలను ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సహ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించి అభినందించారు. అనంతరం ఎంఈవోలు మాట్లాడుతూ.. విద్యార్థులకు అభ్యున్నతికి కృషి చేస్తామని, అందరూ సహకరించాలని కోరారు. **- న్యూస్‌టుడే బృందం**

పనులు పూర్తి కావు.. సమస్యలు తీరవు

● ఇబ్బందుల్లో రైతులు, వాహనదారులు

న్యూస్‌టుడే, తూప్రాన్: అధికారుల మధ్య సమన్వయ లోపం అభివృద్ధి పనులకు శాపంగా మారుతుంది. నిధులు దండిగా ఉన్నా చిన్న చిన్న కారణాలతో పనులు ఏళ్ల తరబడి నిలిచిపోతున్నాయి. ఈ దుస్థితి తూప్రాన్ పట్టణం నుంచి రెండు పడకగదుల ఇళ్ల నుంచి కిష్టాపూర్ వెళ్లే దారి వరకు రూ.2.50కోట్లతో బీటీ రోడ్డు పనులు మూడేళ్ల క్రితం ప్రారంభించారు. రెండు వరుసల రహదారి విస్తరణ పనుల్లో భాగంగా రెండేళ్ల క్రితం కంకర పోసి వదిలేశారు. ఇప్పటి వరకు తిరిగి పనులను ప్రారంభించ లేదు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే వాహనదారులు, రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే రహదారి పనులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



తొలగించని స్తంభాలు

రెండు జిల్లాల ప్రజలకు తప్పని ఇబ్బందులు: తూప్రాన్ పట్టణానికి తూర్పు భాగంలో పట్టణానికి బైపాస్ రోడ్డు నిర్మించడంలో భాగంగా నాటి ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి నిధులు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు. ఈ దారి పూర్తయితే తూప్రాన్, కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి, కోనాయిపల్లి(పీబీ), మల్కాపూర్‌తో పాటు సిద్దిపేట జిల్లాలోని పలు గ్రామాలకు ఉపయోగకరంగా ఉంటుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రహదారిపై అధికారులు సరైన శ్రద్ధ చూపడం లేదనే రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్-కిష్టాపూర్ దారిలో నిధులతో మొదటి బీటీరోడ్డు ఇదే కావడం గమనార్హం. 2 కి.మీ దూరంతో ఈ రోడ్డు పనులు చేపడతున్నారు.

దారికి అడ్డంగా స్తంభాలు: రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్తు స్తంభాలను తొలగించకపోవడంతో



తూప్రాన్‌లో మధ్యలో నిలిచిన బైపాస్ రోడ్డు పనులు

పనులకు ఆటంకం ఏర్పడుతుందని అధికారులు చెబుతున్నారు. వీటిని తొలగించాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులు విద్యుత్తు శాఖ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. నిధులు మంజూరు కానీ కారణంగా మూడేళ్లగా రోడ్డును విస్తరించినా మధ్యలో స్తంభాలను మాత్రం తొలగించలేదు. వీలైనంత త్వరగా స్తంభాలు తీసేస్తే పనులు సాఫీగా సాగే అవకాశం ఉంది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం: ఖాజా మొయినోద్దీన్, పురపాలిక కమిషనర్, తూప్రాన్

తూప్రాన్ పురపాలికలో నిర్మిస్తున్న బీటీ రోడ్డు పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ప్రస్తుతం చివరి దశ పనులు సాగుతున్న తరుణంలో నిలిచిపోయాయి. దారికి అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించేలా తగిన చర్యలు తీసుకుంటాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట 80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట 94402 31031
తూప్రాన్	96762 58144	(10AM TO 1 PM)
చేగుంట	80085 73200	

న్యూస్‌టుడే, అల్లాదుర్గం, చేగుంట, పెద్దశంకరంపేట

? అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ గ్రామం వద్ద అకోలా,హైదరాబాద్161-జాతీయ రహదారి సర్వీసు రోడ్డుకు ఆనుకొని మిషన్ భగీరథ ప్రధాన పైపు పగిలి నీరు వృథాగాపోతుంది. **– జనార్దన్, గడిపెద్దాపూర్**

✔ సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్య పరిష్కరిస్తాం. **– నిజాం, మిషన్ భగీరథ ఏఈ, అల్లాదుర్గం**

? చేగుంటలోని సప్తగిరి కాలనీలో చాలా వీధుల్లో సీసీ రోడ్లు లేవు. గుంతల దారులతో రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. సీసీ రోడ్లు ఎప్పుడు వేస్తారు? **– రామకృష్ణ, చేగుంట**

✔ ప్రస్తుతం పంచాయతీలో నిధుల కొరత ఉంది. ఏవైనా నిధులు వస్తే సీసీ దారులు నిర్మించి గ్రామస్థుల ఇబ్బందులు తొలగిస్తాం. **– నరేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

? మండల కేంద్రం పెద్దశంకరంపేట తిర్మలాపురం వీధిలో బోరు రంధ్రం ప్రమాదకరంగా మారింది. సంస్కార్ విద్యాలయం వైపు వెళ్లే దారిలో ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.**– వంశీ, స్థానికుడు**

✔ బోరు రంధ్రాన్ని వెంటనే మూసివేయించేలా చర్యలు తీసుకుంటాం. **– వెంకటరాములు, పంచాయతీ కార్యదర్శి**

నీటి సరఫరాలో సమస్యలు లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఈఈ నాగభూషణం

పెద్దశంకరంపేట, టేక్మాల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో నీటి సరఫరా విభాగంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని గ్రామీణ మంచినీటి సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నీటి నాణ్యత, లీకేజీలు, ట్యాంకుల శుభ్రత, చేతి పంపులు, సింగిల్ ఫేజ్, త్రీఫేజ్ మోటార్ల వినియోగంపై కల్పించనున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మిషన్ భగీరథ నీటిపై పూర్తిస్థాయిలో ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సహాయకులకు తెలుసుకున్న విషయాలపై పరీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్, ఎంపీవో విఠల్‌రెడ్డి తదితరులున్నారు. టేక్మాల్ మండల పరిధిలో నీటి సరఫరా సహాయకులకు బుధవారం శిక్షణ ప్రారంభించారు. నాలుగు రోజుల పాటు శిక్షణ కొనసాగనుంది. మండల పంచాయతీ అధికారి రియాజొద్దీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ, శిక్షకుడు మధు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం: డీపీవో



కామారంలో పారిశుద్ధ్య కార్మికురాలికి భద్రత కిట్లను అందిస్తున్న డీపీవో యాదయ్య

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డీపీవో యాదయ్య అన్నారు. బుధవారం మండల పరిధి కామారం, మిర్జాపల్లి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులకు భద్రత కిట్లను అందజేసి మాట్లాడారు. కాలానుగుణ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని పరిశీలించారు. గ్రామాల్లో చెత్తాచెదారం తొలగిస్తూ శుభ్రంగా ఉంచుతున్న కార్మికులను అభినందించి, వారికి వైద్య పరీక్షలు చేయించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. అంతకు ముందు ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో దామోదర్, ఎంపీవో గిరిజా రాణి, పంచాయతీ కార్యదర్శి సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



నర్సాపూర్: అవగాహన కల్పిస్తున్న ఎంపీవో శ్రీనివాస్

మెదక్ రూరల్, మెదక్ టౌన్, నర్సాపూర్ రూరల్, చిన్నశంకరం పేట, వెల్దుర్తి, మనోహరాబాద్, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, నివారిస్తేనే భవిష్యత్తు తరాల వారు ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతారని మెదక్ పురపాలిక హెల్త్ అసిస్టెంట్ మహేశ్ అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం మెదక్ పట్టణంలోని 2, 3 వార్డుల్లో తడి, పొడి, హానికర చెత్తపై అవగాహన కల్పించారు. మెదక్ మండలం రాజ్‌పల్లి, మంబోజిపల్లి, మక్తభూపతిపూర్ పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీడీవో రఘు, ఎంపీవో హన్మంత్ ఉన్నారు. నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి, నత్నాయిపల్లితో పాటు పలు గ్రామాల్లో స్వచ్ఛతపై గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీవో శ్రీనివాస్ తెలిపారు. కౌడిపల్లి మండలంలో పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయించినట్లు ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. చిన్నశంకరంపేటలో మండల వైద్యాధికారి సాయిసింధు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వెల్దుర్తి ఉమ్మడి మండలం వ్యాప్తంగా కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వెల్దుర్తి పీహెచ్‌సీ వైద్యురాలు సౌజన్య తెలిపారు. మనోహరాబాద్ పీహెచ్‌సీలో పంచాయతీ కార్మికులకు వైద్యుడు వికాస్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు.

కలెక్టరేట్‌లో శునకాల సంచారం



మెదక్, న్యూస్‌టుడే: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోకి శునకాలు ప్రవేశిస్తున్నాయి. దీంతో అక్కడకు వచ్చే వారు భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం నాలుగు శునకాలు కార్యాలయంలోని ప్రధాన ద్వారం వద్దకు వచ్చాయి. గేటు వద్ద సెక్యూరిటీ సిబ్బంది ఉన్నప్పటికీ.. వారు పట్టించుకోకపోవడంతో అవి లోపలికి వచ్చేశాయి.

బీమా చెక్కు అందజేత

కౌడిపల్లి: జాజితండాకు చెందిన అంబుర్యా నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. భాజపా పార్టీలో సభ్యత్వం ఉంది. బీమా కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును గోమారంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి తన స్వగృహంలో మృతుడి భార్యకు బుధవారం అందజేశారు.

ఆర్థిక సాయం

శివ్వంపేట: చిన్నగొట్టిముక్ల గ్రామానికి చెందిన చోటు ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మాజీ జడ్పీటీసీ సభ్యుడు మహేష్‌గుప్తా బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు సాయం అందించారు.

ఘనంగా వినాయకుడి నిమజ్జనం

మనోహరాబాద్, శివ్వంపేట: కోనాయిపల్లి(పీటీ)లో గణపతికి 17రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనం చేశారు. లడ్డూను భాజపా నాయకుడు చంద్రశేఖర్ వేలంలో రూ.51వేలకు దక్కించుకున్నారు. శివ్వంపేటలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో వినాయకుడి నిమజ్జనం చేశారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

చిన్నశంకరంపేట, వెల్దుర్తి, న్యూస్‌టుడే: పిల్లలకు పోషకాహారం పెట్టాలని, అప్పుడే వారిలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు అంజమ్మ తల్లితండ్రులకు సూచించారు. బుధవారం మండల పరిధి కొర్విపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్యపరీక్షలు చేయించారు. పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని వెల్దుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వరలక్ష్మి తెలిపారు.

హత్యాయత్నం చేశారని ఐదుగురిపై ఫిర్యాదు

అల్లాదుర్గం: రోడ్డుపై వస్తుండగా అడ్డుకొని హత్యాయత్నానికి పాల్పడ్డారని ఐదుగురిపై ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాలు.. అల్లాదుర్గం మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రవీందర్‌రెడ్డి ద్విచక్ర వాహనంపై వస్తుండగా అల్లాదుర్గం గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన నర్సింహారెడ్డి, వెంకయ్య, మహేందర్‌రెడ్డి, సంగారెడ్డి, సాయిరెడ్డిలు పాత కక్షలతో అడ్డుకొని హత్య చేసేందుకు వెంబడించడంతో వారి నుంచి తప్పించుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై ఎస్సై ప్రవీణ్‌రెడ్డిని సంప్రదించగా ఫిర్యాదు అందిందని.. గురువారం కేసు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న అశోక్‌గౌడ్, ఇందిర

నర్సాపూర్, న్యూస్‌టుడే: మహిళా సంఘాలకు ఆయా పథకాలు, బ్యాంకుల ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ సూచించారు. బుధవారం స్థానిక పుర కార్యాలయంలో మెప్మా అర్బన్ పీడీ ఇందిరతో పాటు ఆర్పీలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మహిళా శక్తి యూనిట్ల స్థాపనలో ముందుండాలన్నారు. బ్యాంకు లింకేజీ రుణాలు పొందడంతో పాటు సకాలంలో తిరిగి చెల్లించడంతో వేరొకరికి రుణం అందించే అవకాశం ఉంటుందన్నారు. మేనేజర్ మధుసూదన్, కౌన్సిలర్ యాదగిరి, ఆర్పీలు రమ, రేణుక, లత తదితరులున్నారు.

ఎరువు మందుల దుకాణాల తనిఖీ

రామాయంపేట, న్యూస్‌టుడే: రైతులు అనుమతి ఉన్న దుకాణాల్లోనే పురుగు మందులు కొనుగోలు చేయాలని నిజాంపేట ఏవో సోమిరెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మారుతి ట్రేడర్స్, జగదాంబ ట్రేడర్స్, అయ్యప్ప దుకాణాల్లో విక్రయిస్తున్న పలు కంపెనీల పురుగు మందుల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.

ప్రాథమిక పాఠశాలల్లో హెచ్‌ఎంలను నియమించాలి: టీపీటీఎఫ్

వెల్దుర్తి(మాసాయిపేట): ప్రతి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులను నియమించాలని టీపీటీఎఫ్ మాసాయిపేట మండల అధ్యక్షుడు షేక్ మహబూబ్ భాషా, ప్రధాన కార్యదర్శి పాతూరి స్వప్నశ్రీ డిమాండ్ చేశారు. బుధవారం మాసాయిపేటలో జరిగిన ఆ సంఘం మండల కమిటీ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధ్యక్షులుగా రాజమణి, ఎస్.శ్యాంసుందర్, కార్యదర్శులుగా సత్యానందం, హరికిషన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్‌గా మధుసూదన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని మహబూబ్ భాషా తెలిపారు.

పౌష్టికాహారంతో కంటిచూపు మెరుగు

నర్సాపూర్ రూరల్, న్యూస్‌టుడే: మంచి పౌష్టికాహారంతోనే కంటిచూపు మెరుగు పడుతుందని, అందుకోసం పోషకాల ఉన్న ఆహారం తీసుకోవాలని కంటి వైద్యురాలు శోభారాణి అన్నారు. బుధవారం మండల పరిధి రెడ్డిపల్లిలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్ ట్రైబల్ సొసైటీ ఏకల్ అభియాన్ మహిళా సమితి, ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ సికింద్రాబాద్, సరోజనిదేవి కంటి ఆస్పత్రి సహకారంతో నిర్వహించినట్లు చెప్పారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పారిశుద్ధ్య కార్మికులకు దసరా పండగను పురస్కరించుకుని నూతన దుస్తులు అందజేసినట్లు మాజీ వార్డు సభ్యుడు అచ్చగౌని ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. కాళ్లకల్ పంచాయతీలో 20 మంది మహిళా కార్మికులకు బుధవారం తన భార్యతో కలిసి చీరలు పంపిణీ చేశారు.

జీవో-25ను ఉపసంహరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

చిన్నశంకరంపేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో-25తో ఉపాధ్యాయులపై పనిభారం పెరిగి, విద్యార్థులకు పాఠాలను బోధించలేమని వివిధ ఉపాధ్యాయ సంఘం నాయకులు తెలిపారు. బుధవారం చిన్నశంకరంపేటలోని ఆదర్శ పాఠశాలలో భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. 11-60మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులుంటే పిల్లలపై భవిష్యత్తు ప్రభావం పడుతుందన్నారు. సంఘాల నాయకులు శివప్రసాద్, సత్యనారాయణ, సతీష్, శ్రీనివాస్, రామబ్రహ్మం, మహేందర్ తదితరులున్నారు.

పీఆర్టీయూ కార్యవర్గం ఎన్నిక

చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తామని పీఆర్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు సునీల్, బుచ్చిరాములు అన్నారు. బుధవారం చిలప్‌చెడ్ ప్రాథమిక పాఠశాలలో ఆ సంఘం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా బి.సునీల్, ప్రధాన కార్యదర్శిగా బుచ్చిరాములు, అసోసియేట్ అధ్యక్షుడిగా శ్రీనివాస్, మహిళా ఉపాధ్యక్షురాలిగా వాణిదేవి, కార్యదర్శిగా నర్సింలును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కృష్ణ తదితరులున్నారు.

వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని వెల్దుర్తి తహసీల్దార్ కృష్ణకు వెల్దుర్తి మండలం వీఆర్‌ఏల వారసులు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈ నెల 29న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తహసీల్దార్లతో జరగనున్న సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు కోరారు. 61ఏళ్లు పైబడిన వీఆర్‌ఏల వారసులందరికి ఉద్యోగాలు ఇవ్వాలని వారు తహసీల్దార్‌ను కోరారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: ఇండేన్ వంట గ్యాస్ సిలిండర్ల నుంచి మండలంలోని దామరంచ వద్ద మంగళవారం గ్యాస్‌ను ఖాళీ సిలిండర్లలోకి అక్రమంగా రీఫిలింగ్ చేస్తుండగా వినియోగదారులు పట్టుకున్నారు. బుధవారం వెల్దుర్తి వద్ద గల ఇండేన్ గ్యాస్ గిడ్డంగిని తహసీల్దార్ కృష్ణ తనిఖీ చేశారు. సిలిండర్లను తూకం వేయించి పరిశీలించారు. సిలిండర్ల నుంచి గ్యాస్ దొంగతనం జరుగుతున్న విషయమై పౌరసరఫరాల శాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తహసీల్దార్ చెప్పారు. ఇకపై అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గిర్దవార్ జయభరత్‌రెడ్డి తదితరులున్నారు.

సీసీ రోడ్డు వేయాలని ఆందోళన

శివ్వంపేట, న్యూస్‌టుడే: మండలంలోని పిల్లుట్ల ఎస్సీ వాడ నుంచి బీసీ వాడకు ఉన్న రోడ్డు బురదమయం కావడంపై బుధవారం గ్రామస్థులు నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో సీసీ రోడ్డు పనులు వేరే వాడల్లో చేపట్టి, సమస్య ఉన్న చోట మాత్రం చేయడం లేదన్నారు. అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా సీసీదారి నిర్మించాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ శాఖలోకి బదిలీ చేయాలని వినతి

తూప్రాన్, న్యూస్‌టుడే: మండలంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న పాత రెవెన్యూ సిబ్బందిని తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న పాత వీఆర్‌ఏలు బుధవారం తహసీల్దార్ విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందించారు.

అసంపూర్తి భవనాలు.. అవస్థల్లో ప్రజలు



వెల్దుర్తిలో సామాజిక భవనం



చేగుంట మండలం కసాన్‌పల్లిలో

ప్రజా సౌకర్యాల కోసం ప్రభుత్వాలు నిధులు మంజూరు చేసి భవన నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా తొలుత ఆరంభ శూరత్వంగా భవనాలు పనులు ప్రారంభించినా తర్వాత అర్ధాంతరంగా నిలిచిపోతున్నాయి. ఫలితంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇలాంటి దుస్థితి ఆయా మండలాల్లో నెలకొంది.

● వెల్దుర్తిలోని కోటకింద వాడలో సామాజిక భవనం 25ఏళ్ల క్రితం జిల్లా పరిషత్తు సాధారణ నిధులతో చేపట్టారు. నిర్మాణ పనులను బేస్‌మెంట్, సగం వరకు పిల్లర్లు నిర్మించారు. నిధుల కొరతతో గుత్తేదారు పనులు అసంపూర్తిగా వదిలేశారు. నాటి నుంచి అధికారులు కాని ఇటు ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికే వందల సార్లు అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు సామాజిక భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరినా పట్టించుకునే వారే కరవయ్యారు. 25సంవత్సరాలుగా భవనం నిర్మాణం పూర్తయ్యేందుకు స్థానికులు ఎదురుచూపులు చూస్తున్నారు తప్ప ముందుకు కదలడం లేదు. ఇప్పటికైనా అధికారులు అవసరమైన నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

● చేగుంట మండలం కసాన్‌పల్లిలో తొమ్మిదేళ్ల క్రితం పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. రూ.20లక్షలతో నిర్మాణ పనులు చేపట్టారు. బేస్‌మెంట్, పిల్లర్లు వేసి స్లాబు వరకు నిర్మాణం చేపట్టేందుకు ఏడాది పట్టింది. నాటి నుంచి పనులు పూర్తిగా ఆగిపోయాయి. నిధులు సరిపోక పనులు మధ్యలో నిలిపివేశారు. మరో రూ.10లక్షలు మంజూరు చేయిస్తే పూర్తయ్యే అవకాశం ఉంది. ఎనిమిదేళ్లుగా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పాత పాఠశాల భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఒకే గది ఉండటంతో ప్రజలకు, అధికారులకు ఇబ్బందిగా మారింది. వెంటనే నిర్మాణ పనులు పూర్తిచేసి భవనాన్ని వినియోగంలోకి తేవాలని గ్రామస్థులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి, చేగుంట**

దేశ ఐక్యతలో దీన్ దయాళ్ కృషి ఎనలేనిది: భాజపా



మెదక్: దీన్ దయాళ్ పటానికి నివాళులు అర్పిస్తున్న గడ్డం శ్రీనివాస్, నాయకులు

మెదక్ అర్బన్, మెదక్ టౌన్, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట, టేక్మాల్, న్యూస్‌టుడే: దేశ సమైక్యతకు అహర్నిశలు శ్రమించిన పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జీవితం అందరికి ఆదర్శమని భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. బుధవారం దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకుని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. భాజపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఎల్ఎన్‌రెడ్డి, పట్టణాధ్యక్షుడు ప్రసాద్, నాయకులు విఠలేష్, సంగీత తదితరులున్నారు. మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంత్యోదయ దివాస్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ హుస్సేన్ మాట్లాడుతూ..సమ్మిళిత అభివృద్ధి, సామాజిక న్యాయం, సాధికారత, ఆహార భద్రత సాధించడమే లక్ష్యంగా ఆ పథకాన్ని ప్రారంభించారన్నారు. అధ్యాపకులు మల్లేశం, గణపతి, రాజాగౌడ్ ఉన్నారు. అల్లాదుర్గంలోఆ పార్టీ జిల్లా నాయకులు బ్రహ్మం ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జిల్లా నాయకులు రాములు, ఆంజనేయులున్నారు. పెద్దశంకరంపేటలో భాజపా మండలాధ్యక్షుడు కోనం విఠల్, మండల ప్రధాన కార్యదర్శి శ్రావణ్‌కుమార్, మాజీ సర్పంచి సుధాకర్, కృష్ణ, సుభాష్ పాల్గొన్నారు. టేక్మాల్ పంచాయతీ పరిధి గొల్లగుడెంలో భాజపా నాయకులు ఎల్లుపేట రాజు, రాములు, సిద్దిరాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీ పటిష్టానికి కృషి

తూప్రాన్, శివ్వంపేట, న్యూస్‌టుడే: గ్రామీణ స్థాయిలో భాజపా పార్టీ పటిష్టతో పాటు సభ్యత్వ నమోదు చేపడుతున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి అన్నారు. బుధవారం శివ్వంపేట మండలం కొంతాన్‌పల్లిలో పార్టీ సభ్యత్వ నమోదును మండలాధ్యక్షుడు రవితో కలిలి చేపట్టారు. తదితరులు పాల్గొన్నారు. తూప్రాన్‌లో జానకిరామ్‌గౌడ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. పోతరాజు నాగరాజ్, మధుసూదన్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసే వరకు పోరాటం: భారాస



మాట్లాడుతున్న చంద్రాగౌడ్ తదితరులు

నర్సాపూర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు భారాస పోరాటం కొనసాగిస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు చంద్రాగౌడ్ అన్నారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దాడులను ప్రోత్సహించడమే మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వ్యాఖ్యలు ఉన్నాయని, ఎమ్మెల్యే ఇంటిపై దాడిని ఖండించ కుండా ప్రోత్సహించడం తగదన్నారు. గోమారంలో మాధవరెడ్డి గొడవలు సృష్టించారని, ఆయన్ని మైనంపల్లి మందలించకపోగా సమర్థించడం ఏమిటని ప్రశ్నించారు. బల్దియా ఉపాధ్యక్షుడు నయీమొద్దీన్, పార్టీ మండలాధ్యక్షులు బోగశేఖర్, రామాగౌడ్ తదితరులున్నారు.

పాఠశాలకు సామగ్రి బహూకరణ

చిలప్‌చెడ్,: విద్యార్థుల అభ్యున్నతికి తోడ్పాటు అందించడం అదృష్టమని చౌటకూరి బ్రదర్స్ గోవర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం చంద్రశేఖర్‌రెడ్డి జన్మదిన సందర్భంగా చిలప్‌చెడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చౌటకూరి బ్రదర్స్ రూ.35వేల విలువైన సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయురాలు వేదశ్రీ వారిని శాలువాతో సన్మానించారు.

క్షేత్రస్థాయి పర్యటనతో విద్యార్థులకు మేలు



విద్యార్థులతో అధ్యాపకులు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: ప్రత్యక్ష బోధన ద్వారానే విద్యార్థులకు ఉత్తమ అభ్యాసనం దోహదపడుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగాధిపతి విశ్వనాథం అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం మెదక్ పట్టణంలోని డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర విభాగం తృతీయ సంవత్సరం బీఎస్సీ, బీజడ్సీ విద్యార్థులు పట్టణంలోని చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించారు. మత్స్యశాఖ అధికారి మల్లేశం ఆధ్వర్యంలో ఫిషరీస్ ఫీల్డ్ అధికారి సంతోష్‌కుమార్ చేపపిల్లల పెంపకంపై విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు వినోద్‌కుమార్, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.